సాక్షి
విజయనగరం
బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



రాములోరి పెళ్లికి రారండోయ్..! - 8లో

రామతీర్థానికి పెళ్లి కళ వచ్చేసింది. సీతా రాముల కల్యాణ వేడుకను తిలకించేందుకు వేయి కళ్లతో భక్తజనం ఎదురుచూస్తోంది.



20 ఎకరాల గడ్డివాములు దగ్ధం

రేగిడి మండలం ఆమదాలవలస గ్రామంలో 20 ఎకరాలకు చెందిన గడ్డివాములు సోమ వారం రాత్రి కాలిపోవడంతో బాధిత రైతులు గగ్గోలు పెడుతున్నారు. - 8లో



8 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

గంజాయి తరలిస్తున్నవారిని పార్వతీపురం పోలీసులు పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

సీతమ్మకు బంగారు శతమానాలు



సీతమ్మ తల్లికి బంగారు శతమానాలు సమర్పిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి సతీమణి వెంకటరమణి

విజయనగరం: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని విజయనగరం చిక్కాలవీధి రామ మందిరంలోని సీతమ్మతల్లికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సతీమణి కోలగట్ల వెంకట రమణి బంగారు శతమానాలను మంగళవారం సమర్పించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. పూజల్లో వనజ, రత్నం, కందుకూరి రాణి తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

తెర్లాం: లైంగిక దాడి, మోసగించిన కేసులో నిందితునికి ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.10వేలు జరిమానా విధిస్తూ విజయనగరం 5వ ఏడీజే మహిళా కోర్టు న్యాయమూర్తి ఎస్.పద్మావతి తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించి తెర్లాం ఎస్‌ఐ ఆర్.రమేష్ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా... మండలంలోని రంగప్పవలస గ్రామానికి చెందిన ధమరసింగి రామకృష్ణ అదే మండలం వెలగవలస గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. లైంగిక దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై 2016లో తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో బాధిత యువతి రామకృష్ణపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఏఎస్‌ఐ బి.అప్పారావు కేసు నమోదు చేయగా, బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.గోవిందరావు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసును ప్రాధాన్యతా కేసుగా తీసుకొని ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసి నిందితుడికి శిక్షపడేలా చర్యలు చేపట్టారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్రనాథ్ కోర్టులో వాదనలు వినిపించగా, బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు పర్యవేక్షణలో ఎస్‌ఐ రమేష్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ జనార్దన్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచడంతో నిందితుడికి శిక్ష పడింది.

రాములోరి పెళ్లికి.. మండపేట బొండాలు



మండపేట బొండాలను అర్చకులకు అందజేస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి సందర్భంగా ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్న స్వామి వారి కల్యాణానికి మండపేట బొండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తూర్పుగోదావరి జిల్లా మండపేట నుంచి రామతీర్థం సేవా సంఘం ప్రతినిధులు ప్రత్యేకంగా సిద్ధం చేసిన కొబ్బరి బొండాలను తీసుకువచ్చారు. మండపేటకు చెందిన రామ భక్తుడు అచ్యుతరామరెడ్డి శ్రేష్ఠమైన బొండాలను సేకరించి వాటికి రంగు రాళ్లు, పూసలు, రిబ్బన్లతో సుందరంగా అలంకరించారు. సీతారాముల పేర్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వాటిని సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం ఆలయ అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో ఈట శ్రీనివాసరావు, సేవా సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సుందరంగా తీర్చిదిద్దిన మండపేట బొండాలు

మా‘లోకం’ అనుకుంటే... మా పుట్టి ముంచేస్తోంది!

ఆక్రమణలు.. అక్రమాలు చేయడం ఆమెకు వెన్నతోపెట్టిన విద్య. ఇప్పుడు అదే విద్యను రాజకీయ రంగంలో ప్రదర్శిస్తున్నారు. టీడీపీ కంచుకోటను డబ్బుమూటలతో కుదేలు చేస్తూ.. జనసేన బలం పెంచుకుంటున్నారు. ఎన్నికల్లో గెలవకపోయినా.. భవిష్యత్తులో టికెట్ కోసం ఎవరికాళ్లూ పట్టుకోకూడదన్న ఉద్దేశంతో పార్టీని పటిష్టం చేస్తున్నారు. ఇన్నాళ్లూ మా‘లోకం’ అంటూ తిరుగుతున్న పసుపుచొక్కా నాయకులు.. ఆమె చర్యలతో కలవరపడుతున్నారు. టీడీపీ పుట్టిమునిగిపోతోందంటూ మదనపడుతున్నారు.



- నెల్లిమర్ల కూటమి అభ్యర్థి లోకం మాధవిపై టీడీపీ నాయకుల గరంగరం
- చేరికల పేరుతో టీడీపీ అస్తిత్వాన్నే దెబ్బకొట్టే ప్రయత్నాలు!
- టీడీపీ కార్యకర్తలకూ వైఎస్సార్‌సీపీ మునుగేసి జనసేన తీర్థం
- ఇదే పరిస్థితి కొనసాగితే నెల్లిమర్లలో టీడీపీకి నూకలు చెల్లినట్లే!
- పలాసకు పరుగెత్తి చంద్రబాబు ముందు టీడీపీ నాయకుల ఆవేదన
- మాధవిని ఏమీ అనలేక నీళ్లునమిలిన చంద్రబాబు!

సాక్షి ప్రతినిధి, విజయనగరం: కూటమి అభ్యర్థిగా నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన నాయకురాలు లోకం మాధవి ఒంటెత్తు పోకడలు టీడీపీ నాయకులకు కంటిమీద నిద్రలేకుండా చేస్తున్నాయి. సుదీర్ఘ కాలం చక్రం తిప్పిన టీడీపీ నాయకులు ఆమె తీరుతో బెంబేలెత్తిపోతున్నారు. మంచి ప్యాకేజీలతో చేరికలకు తెరతీయడంతో టీడీపీ కార్యకర్తలు సైతం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. టీడీపీ కండువాలను పక్కనపెట్టి జనసేన కండువాలు వేసుకుంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కూటమి మాటెలా ఉన్నా తమ పార్టీకి నెల్లిమర్ల నియోజకవర్గంలో నూకలు చెల్లినట్లేనని టీడీపీ స్థానిక నాయకులకు బెంగపట్టుకుంది. వారంతా పలాస వచ్చిన చంద్రబాబు వద్దకు స్వయంగా వెళ్లి ‘మహాప్రభో... మాధవి మన పుట్టి ముంచేలా ఉంది’ని మొర పెట్టుకున్నా అధినేత నీళ్లు నమలడం తప్ప ఏమీ భరోసా ఇవ్వలేకపోయారట!

తొలి నుంచి ఆక్రమణలే లక్ష్యం...

జనసేన పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం నాయకురాలైన లోకం మాధవి, ఆమె భర్త లోకం ప్రసాద్ భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామ పరిధిలో రెండు దశాబ్దాల కిందటే భూములు కొనుగోలు చేశారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేశారు. ఈ ముసుగులో సమీపంలోనున్న ప్రభుత్వ భూములన్నీ ఆక్రమించేశారు. గెడ్డలు, కాలువలతో పాటు కాలిబాటలన్నీ కలిపేసి రోడ్డు వేసేశారు. కల్వర్టులను వారే కట్టేశారు. ఆ భూముల చుట్టూ ప్రహరీ కట్టేసి పెద్ద గేట్లను పెట్టేశారు. అవతల ఉన్న భూముల్లోకి రైతులు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో తమ భూముల్లోకి వెళ్లడానికి తోవలేక, మిరాకిల్ వేధింపులు పడలేక విధిలేని పరిస్థితుల్లో వారు తమ భూములను కూడా మిరాకిల్‌కే వచ్చినకాడికి అమ్మేయాల్సిన పరిస్థితి. ఆక్రమణల్లో దాదాపు 14 ఎకరాల మేర ప్రభుత్వ భూములు, మరో పది ఎకరాల వరకూ డి.పట్టా భూములు ఉన్నట్టు ఇటీవల రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీటి స్వాధీనాన్ని అడ్డుకొంటూ న్యాయస్థానం నుంచి యథాతథస్థితి ఉత్తర్వులు తెచ్చుకోవడం మిరాకిల్‌కే చెల్లింది.

టీడీపీ అస్తిత్వానికే ఎసరు...

పార్టీ మనుగడ కోసం పవన్ కల్యాణ్ మద్దతు తప్పదని టీడీపీ నాయకులకు చంద్రబాబు బుజ్జగించి పంపించినా పార్టీ భవిష్యత్తుకు మాత్రం భరోసా ఇవ్వలేకపోతున్నారు. కూటమి అభ్యర్థిగా లోకం మాధవి ఉన్నప్పటికీ నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మాటే నెగ్గుతుందని చెప్పినా ప్రస్తుతం అలాంటి పరిస్థితులేవీ కనిపించట్లేదు. ఆమె జనసేన పార్టీలో చేరికలకు తెరలేపారు. భారీ ప్యాకేజీలు ఆఫర్ చేస్తూ వైఎస్సార్‌సీపీలో అసంతృప్త నాయకులకు వల వేశారు. ఈ వలలో టీడీపీ కార్యకర్తలు చిక్కుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వెళ్లినవారు ఇప్పుడు తిరిగి టీడీపీలోకి వస్తారనుకుంటే జనసేన తీర్థం పుచ్చుకుంటున్నారు. వారి ప్రభావంతో దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలని టీడీపీ కార్యకర్తలు కూడా జనసేనలోకి పోతున్నారు. ఇది సవ్యంగా సాగాలనే ఉద్దేశంతో ఈ చేరికల కార్యక్రమాలకు టీడీపీ నాయకులను సైతం దరిచేరనీయట్లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీకి నూకలు చెల్లినట్లేనని ఆ పార్టీ నాయకులు దిగాలు చెందుతున్నారు.

డిపాజిట్ దక్కకపోయినా సీటు కేటాయింపు..

పది మందికి ఉపాధి కల్పిస్తున్నామనే ముసుగులో భోగాపురం మండలంలో సంపాదించిన భూములు, ఆక్రమించిన ప్రభుత్వ భూములను కాపాడుకోవడమే లక్ష్యంగా లోకం దంపతులు రాజకీయ రంగప్రవేశం చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గం నుంచే జనసేన అభ్యర్థిగా లోకం మాధవి తొలుత పోటీచేశారు. ఆమెకు 7,550 ఓట్లు మాత్రమే వచ్చాయి. డిపాజిట్ కూడా దక్కలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా పట్టు సాధించాలని రెండేళ్ల నుంచి ‘మిరాకిల్’ కేంద్రంగా రాజకీయాలకు తెరలేపారు. మరోవైపు నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జిగా చంద్రబాబు ప్రకటించిన కర్రోతు బంగార్రాజు సహా ఆ పార్టీ నాయకులంతా ఆమెను తక్కువగా అంచనా వేశారు. ఆమె ధనబలం ముందు వారంతా దూదిపింజల్లా తేలిపోయారు. పవన్ కల్యాణ్ తొలుత ప్రకటించిన ఐదుగురు అభ్యర్థుల్లో లోకం మాధవి కూడా ఉండటంతో టీడీపీ నాయకులకు మతిపోయింది. తిరుగుబాటు చేస్తామని ప్రకటించిన బంగార్రాజు తదితర నాయకులంతా తర్వాత సన్మానం చేయాల్సి వచ్చిందంటే ఆమె పవర్ ఊహించవచ్చు.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు...

పూసపాటిరేగ మండలం రెల్లివలసలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడి నివాసంలో నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ నాయకులు శనివారం రాత్రి రహస్యంగా సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచారానికి జిల్లాకు వచ్చిన చంద్రబాబు పలాసలో బస చేయడంతో మంగళవారం వారంతా అక్కడకు వెళ్లి కలిశారు. నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, మహంతి చిన్నంనాయుడు బృందం చంద్రబాబుకు తమ కష్టాలను మొరపెట్టుకున్నా సానుకూల స్పందన కనిపించలేదని తెలిసింది.

సివిల్స్‌లో విజయకేతనం

ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు సివిల్స్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. ఐఆర్‌ఎస్‌లో శిక్షణలో ఉంటూ ఒకరు.. పట్టువీడని విక్రమార్కుడిలా మూడో ప్రయత్నంలో మరొకరు విజేతలుగా నిలిచారు. యువతకు స్ఫూర్తిమంత్రం వినిపించారు.

పార్వతీపురం మురిసేలా...

- సివిల్స్ ఫలితాల్లో 493వ ర్యాంకు
- మూడో ప్రయత్నంలోనే సాధించిన దొనక పృథ్వీరాజ్



తల్లితో సివిల్స్ విజేత పృథ్వీరాజ్

పార్వతీపురం టౌన్/కురుపాం: పార్వతీపురం యువకుడు.. సివిల్స్‌లో సత్తా చాటాడు. ఆలిండియా స్థాయిలో 493వ ర్యాంకు సాధించాడు. మూడో ప్రయత్నం.. రెండో ఇంటర్వ్యూలోనే.. ఎటువంటి కోచింగ్ కూడా తీసుకోకుండానే లక్ష్యాన్ని అందుకోవడం విశేషం. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ - 2023 తుది ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇందులో పార్వతీపురం పట్టణంలో నివాసం ఉంటున్న దొనక విజయ్‌కుమార్, వెంకటరత్నంల కుమారుడు 23 ఏళ్ల దొనక పృథ్వీరాజ్ ఉత్తమ ర్యాంకు సాధించాడు. దీంతో ఆ కుటుంబంలో సంబరాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా ‘సాక్షి’తో ప్రత్యేకంగా మాట్లాడిన పృథ్వీ.. లక్ష్యం కోసం రోజుకు 8 గంటలకుపైగా కష్టపడ్డానని చెప్పాడు. అతని మాటల్లోనే...

తండ్రిని చూసి స్ఫూర్తి పొందా..

మాది స్వప్రాంతం కురుపాం. చిన్నతనంలోనే పార్వతీపురం వచ్చి స్థిరపడ్డాం. అప్పట్లోనే నాన్న ఎంఈఓగా పని చేశారు. ప్రభుత్వ శాఖల్లో పరిపాలన, ప్రజలకు సేవ చేసే విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. అప్పటి నుంచి ప్రభుత్వ సర్వీసుల్లోకి రావాలని అనుకున్నా. పదో తరగతి వరకు పార్వతీపురంలో, ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో చదివా. ఉస్మానియా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్(ఆర్ట్స్) చదువుతున్నప్పుడే పూర్తిస్థాయిలో సివిల్స్‌పై దృష్టి సారించా.

కోచింగ్ లేదు.. ఇంటి వద్దే కష్టపడ్డా

సివిల్స్ లక్ష్య సాధన కోసం ఎక్కడా ప్రత్యేకించి కోచింగ్ తీసుకోలేదు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆప్షనల్‌గా తీసుకున్నా. రోజుకు 8 గంటలు ఇంటి వద్దే ఉండి కష్టపడి చదివా. పరీక్షల సమయంలోనే 10-11 గంటల సమయం వెచ్చించా. మూడో ప్రయత్నంలోనే సాధించా. ఇది రెండో ఇంటర్వ్యూ. ఎక్కువగా మెయిన్స్ మీద దృష్టి సారించా. ఈ ఏడాది స్కోరింగ్ రావాలని కష్టపడ్డాను. ప్రజెంటేషన్, ఇతర అంశాలపై దృష్టి సారించి విజయం సాధించాను. సివిల్స్ లక్ష్యంగా చదువుతున్న వారూ ఇదే దృష్టిలో పెట్టుకుంటే మంచిది. త్వరగా గమ్యం చేరుకోవచ్చు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే...

నా విజయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. వారు అడుగడుగునా అండగా నిలిచారు. ప్రస్తుతం నాన్న ఎం.ఆర్.నగరం జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంగా చేస్తున్నారు. అమ్మ ప్రభుత్వ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

అప్పుడు 772.. ఇప్పుడు 590..



ర్యాంక్ సాధించిన భార్గవ్

గంట్యాడ: సివిల్స్‌లో పెదవేమలి గ్రామానికి చెందిన పాటుపురెడ్డి భార్గవ్ సత్తా చాటాడు. మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 590 సాధించాడు. గతేడాది ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 772 ర్యాంక్ సాధించి ముస్సోరిలో ఐఆర్‌ఎస్‌లో శిక్షణ పొందుతున్నాడు. ఈ ఏడాది మళ్లీ పరీక్షకు సిద్ధమై మంచి ర్యాంకు సాధించాడు. ఆయన తల్లి పద్మ గృహిణికాగా, తండ్రి సత్యం విజయనగరం ఆర్టీసీలో సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నారు. చెల్లి కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ ప్రిపరేషన్‌లో ఉంది.

చాలా ఆనందంగా ఉంది..



మా అబ్బాయికి సివిల్స్ ఫలితాల్లో 590 ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఓబీసీ కోటాలో ఐపీఎస్ వచ్చే అవకాశం ఉంది. మొదటి నుంచి చదవులో ముందుండేవాడు. అందుకు అనుగుణంగా మా అబ్బాయిని ప్రోత్సహిస్తూ వస్తున్నాం. మా నమ్మకాన్ని వమ్ము చేయకుండా ర్యాంకు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది. – పొటుపురెడ్డి సత్యం, పద్మ (భార్గవ్ తల్లిదండ్రులు)

అభ్యర్థుల ఖాతాలో ఎన్నికల ఖర్చు




మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభం అవుతుందని, అప్పటి నుంచి అభ్యర్థుల ఎన్నికల ఖర్చు లెక్కించేందుకు సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఎన్నికల అధికారులను ఆదేశించారు. వ్యయ నోడల్ అధికారులు, ఆడిట్ అధికారులు, నియోజకవర్గాల అకౌంటింగ్ బృందాలతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచే అతని ఖాతాల్లో ఖర్చు నమోదు చేయాలని సూచించారు. సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, వినియోగిస్తున్న వాహనాలు, ఏజెంట్లకు పెట్టే భోజనాల ఖర్చు సైతం అభ్యర్థి ఖాతా కిందకే వస్తుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు ఇద్దరూ ఉమ్మడిగా సమావేశాలు, సభలు నిర్వహిస్తే ఆ ఖర్చును ఇద్దరికీ సర్దుబాటు చేయాలని సూచించారు. జిల్లాకు ముగ్గురు ఐఆర్‌ఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిందని, ఒకరు పార్లమెంటుకు, మిగిలిన ఇద్దరూ అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారని చెప్పారు. త్వరలో వారు జిల్లాకు రానున్నారని చెప్పారు. వారు వచ్చేలోగా అవసరమైన అన్ని రిజిష్టర్లను సిద్ధం చేసి, ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సభలు, సమావేశాలు జరిగిన 24 గంట్లలోగానే అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలని, ఆలస్యం చేయకూడదని ఆదేశించారు. సభలు, సమావేశాలకు అనుమతినిచ్చే విభాగం, ఎంసీఎంసీ, ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, సంబంధిత ఇతర బృందాలతో సమన్వయం చేసుకొని, ఖర్చులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎస్.డి.అనిత, జిల్లా ఆడిట్ అధికారి అరుణ కుమారి, జిల్లా వ్యయ నోడల్ అధికారి డాక్టర్ సత్య ప్రసాద్, నియోజకవర్గాల ఏఈఓలు పాల్గొన్నారు.

చంద్రబాబు కుట్ర రాజకీయాలతో... ‘ప్రతిభ’కు దక్కని గౌరవం!

- సిట్టింగ్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతిభా భారతికి రాజకీయ సమాధి
- సీనియర్ నాయకురాలిపై చిన్నచూపు
- సొంత నియోజకవర్గంలో టిక్కెట్ లేకుండా చేసిన వైనం
- తొడగొట్టిన గ్రీష్మకు పంగనామాలు
- కాంగ్రెస్‌పార్టీకి చెందిన వలసనేత కోండ్రుకు అందలం
- డబ్బుకు టికెట్ అమ్మేసిన వైనం
- 25 ఏళ్లుగా మరో ప్రభుత్వ ఉద్యోగినికి ఆశచూపి ఎగనామం
- చంద్రబాబు వంచన రాజకీయంపై భగ్గుమంటున్న టీడీపీలోని ఓ వర్గం





రాజాం: కావలి ప్రతిభా భారతి... టీడీపీ సీనియర్ నాయకురాలు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీలో ఆమె కీలక నేత. మంత్రిగా, స్పీకర్‌గా ఆమె విశేష సేవలు అందజేశారు. చిత్తశుద్ధి, విలువలతో కూడిన రాజకీయాలకు ఆమె కేరాఫ్‌గా మారారు. అలాంటి నాయకురాలి కుటుంబానికి చంద్రబాబు నాయుడు రాజకీయ సమాధి కట్టారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినట్టే ప్రతిభా భారతి కుటుంబానికి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేశారని సొంత పార్టీ నాయకులే పెదవి విరుస్తున్నారు. తన సొంత నియోజకవర్గంలో టీడీపీ టికెట్ కేటాయించకుండా.. డబ్బులకోసం వలసనాయకుడికి టికెట్ అమ్మేశారని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలు గెలిచి రాష్ట్రంలోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభా భారతిని చంద్రబాబు నిలువునా ముంచడంతో ఏమిచేయాలో తోచక.. చంద్రబాబు, కోండ్రుల కుట్ర రాజకీయాలను చూసి ఓర్వలేక.. సొంతగ్రామానికి కూడా రాకుండా విశాఖపట్నం, హైదరాబాద్‌లలో ఆమె గడుపుతున్నారు.

గ్రీష్మకు రిక్తహస్తం..



ప్రతిభా భారతి కుమార్తె గ్రీష్మ టీడీపీ కోసం చాలా కష్టపడ్డారు. తల్లికి అండగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. 2014 నుంచి 2019 వరకూ రాజాంలోనే ఉంటూ అనేక కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సొంత సొమ్ము ఖర్చుచేశారు. 2019లో టిక్కెట్ వస్తుందని ఆశపడి భంగపాటుకు గురయ్యారు. తల్లీకూతుళ్ల వద్ద డబ్బులు లేవని చంద్రబాబు కాంగ్రెస్ పార్టీకి చెందిన కోండ్రును టీడీపీలోకి తీసుకొచ్చి టికెట్ ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కంబాల జోగులు చేతిలో 16,800 ఓట్ల తేడాతో కోండ్రు ఓడిపోయారు. అనంతరం దాదాపు మూడున్నరేళ్ల నియోజకవర్గంలో టీడీపీ కేడర్‌ను ఆయన పట్టించుకోలేదు. ఈ సమయంలో గ్రీష్మ పార్టీకి అండగా నిలిచారు. 2022లో ఒంగోలులో జరిగిన టీడీపీ మహానాడు సభలో తొడగొట్టి వైఎస్సార్‌సీపీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. టికెట్ తనకే వస్తుందని ఆశపడ్డారు. రాజాంలో చంద్రబాబు, లోకేశ్‌ల పర్యటనల విజయవంతానికి కృషిచేశారు. చివరకు తండ్రీకొడుకులిద్దరూ ఆమెకు టికెట్ కేటాయించకుండా పంగనామాలు పెట్టడంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని తమ అనుచరుల వద్ద తరచూ ఏకరువు పెడుతూ.. కోండ్రును చిత్తుగా ఓడించేందుకు తమదైన శైలిలో పావులు కదుపుతున్నట్టు సమాచారం.

25 ఏళ్లుగా ఊరిస్తూ..

మరోవైపు అటు పాలకొండ ఎస్సీ నియోజకవర్గం గా, ఇటు రాజాం నియోజకవర్గం ఏర్పడిన తరువాత పాలకొండ, రాజాం ప్రాంతాల్లో నివసిస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగినికి కూడా చంద్రబాబు నిరాశే చూపించారు. 1994 నుంచి ఓ ప్రభుత్వ ఉద్యోగి టీడీపీ టికెట్ కోసం ప్రయత్నిస్తూ వస్తోంది. టీడీపీ కార్యక్రమాలకు అండగా ఉంటూ ఆర్థిక సాయంచేస్తూ వచ్చింది. పాలకొండ ఎస్సీ రిజర్వేషన్‌లో ఉన్న సమయంలోనే ఆమెకు టికెట్ ఇస్తామని టీడీపీ ఆశచూపింది. అప్పట్లో పలు పత్రికల్లో కూడా ఆమె పేరు బయటకు వచ్చింది. ఆమెకు టికెట్ కేటాయిస్తామని ఆశచూపిన చంద్రబాబు.. తిరిగి నిరాశే మిగిల్చారు. డబ్బున్నవారికే టీడీపీ టిక్కెట్ ఇస్తామని చేతలతో స్పష్టంచేశారు. రాజాంలో సోమవారం నిర్వహించిన ప్రజాగళం సభకు కూడా టీడీపీ వ్యతిరేక వర్గం హాజరుకాలేదు. ప్రతిభాభారతి అభిమానులు, ఇటు సామాజిక వర్గ నేతలు తమ ప్రతాపాన్ని ఓటు రూపంలో చూపిస్తామని చెబుతున్నారు. కన్నింగ్ నాయకుడికి బుద్ధిచెబుతామని స్పష్టంచేస్తున్నారు.



పూసపాటిరేగ: సీహెచ్ అగ్రహారంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ఎస్.కోట: పుణ్యగిరిలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు హారతి ఇచ్చి ఆశీర్వదిస్తున్న మహిళలు

ప్రచార హోరు

ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఊరూరా పార్టీ జెండాలు రెపరెపలాడుతున్నాయి. అభిమాన నాయకులపై జనం పూలజల్లు కురుపిస్తున్నారు. హారతులిచ్చి ఆశీర్వదిస్తున్నారు. మేలు చేసేవారికి అండగా ఉంటామని మాట ఇస్తున్నారు.

– సాక్షినెట్‌వర్క్



విజయనగరం నాలుగో డివిజన్‌లో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి హారతి ఇస్తున్న మహిళ



సంతకవిటి: జి.ఎస్.పురంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

క్లుప్తంగా

20 ఎకరాల గడ్డివాములు దగ్ధం


మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామంలో గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన రుంకు అప్పలనాయుడు, వెంకన్న, వెంకటరమణ, శాసుబిల్లి రాంబాబులు కళ్లాల్లో పశువుల మేత నిమిత్తం ఉంచిన 20 ఎకరాలకు చెందిన గడ్డివాములు సోమవారం రాత్రి కాలిపోవడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. వాటి విలువ రూ.2 లక్షల వరకూ ఉంటుందని రైతులు తెలిపారు. సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపకసిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు.

రెండు పశువుల శాలలు..


కాలిపోయిన పశువుల పాకలు, గడ్డివాము

జామి: మండలంలోని అలమండగ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల పాకలు, ఒక గడ్డివాము దగ్ధమయ్యాయి. అలమండ నుంచి నారాయణపురం వెళ్లే రహదారిలో ఉన్న యాళ్ల వారి చెరువు కళ్లాల వద్ద పశువుల పాకలు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. ఈ ప్రమాదంలో బీల చిన్నప్పలనాయుడు, మిడతాన అప్పలసత్యానికి చెందిన పాకలు, ఒక గడ్డివాము దగ్ధమయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.యాభై వేల ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు. ఈ సమాచారం తెలుసుకున్న వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, ఉపసర్పంచ్ లగుడు దేముడు తదితరులు బాధితులను పరామర్శించారు.

జీడి మామిడి తోటల్లో అగ్నిప్రమాదం


మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేపాడ: మండలంలోని వేపాడ రెవెన్యూలో రాయుడుపేట గ్రామ సమీపంలో ఉన్న జీడి, మామిడి తోటల్లో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్.కోట అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు.

సైబర్ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: మొబైల్‌లో వచ్చిన మెసేజ్‌కు స్పందించి లింక్ ఓపెన్ చేసి, ఓటీపీ చెప్పడంతో బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదు విత్‌డ్రా అయింది. ఈ మేరకు బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం కేసు నమోదు చేసి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రదీప్‌నగర్‌కు చెందిన ఎం.శేషుకుమారి సెల్‌ఫోన్‌కు సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మెసెజ్ వచ్చింది. యాక్సిస్ బ్యాంక్ పేరుతో వచ్చిన మెసేజ్‌లో రివార్డ్ పాయింట్స్ పోతాయని, లింక్ ఆధారంగా వాటిని తీసుకోవాలని పేర్కొనడంతో ఆమె లింక్ క్లిక్ చేసి ఓపెన్ చేసింది. ఓటీపీ చెప్పడంతో ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.లక్షా 98వేల 645 నగదు మాయమైంది. దీంతో వెంటనే ఆమె వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది.

38 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ గ్రామ శివారులో అక్రమంగా మద్యం బాటిల్స్ కలిగిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్సై డి రామగణేష్ తెలిపిన వివరాల ప్రకారం 38 మద్యం బాటిల్స్ కలిగిఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.

నామినేషన్లకు 13 రకాల డాక్యుమెంట్లు తప్పనిసరి : పీఓ

సాలూరు: నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు 13 రకాల డాక్యుమెంట్లు తీసుకురావాలని, ఆ డాక్యుమెంట్లన్నీ సక్రమంగా ఉంటే నామినేషన్లు అనుమతించడం జరుగుతుందని ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ నెల 18 నుండి నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. నాటి నుండి ఈ నెల 25 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని, 26న నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందని అన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹236

రాములోరి పెళ్లికి రారండోయ్..!


ప్రత్యేక అలంకరణలో సీతారాముల ఉత్సవ విగ్రహాలు

- నేడే రామతీర్థంలో సీతారాముల కల్యాణం
- ప్రభుత్వ లాంఛనాలతో వేడుక
- అందరికీ ఆహ్వానం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు

వరుడు: శ్రీరామయ్య
వధువు: సీతమ్మ
వేదిక: సీతారామస్వామివారి కల్యాణ మంటపం, రామతీర్థం
సమయం: శ్రీ క్రోధి నామ సంవత్సర చైత్ర శుద్ధ నవమి, ఉదయం 10.30 గంటల నుంచి 12.30 వరకు
సుముహూర్తం: 12గంటలకు అభిజిత్ లగ్నం
అభ్యర్థన: వేద పండితుల వేదమంత్రోచ్ఛారణ నడుమ కనీవిని ఎరుగని రీతిలో జరిగే సీతారామచంద్ర ప్రభువు వివాహాన్ని కనులారా తిలకించి సీతాసమేత రామస్వామివారి అనుగ్రహాన్ని పొందాలని మనవి.

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థానికి పెళ్లి కళ వచ్చేసింది. శ్రీ సీతారాముల కల్యాణ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తజనం వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. రామస్వామి వారి దేవస్థానం సమీపంలోని స్వామివారి కల్యాణ మంటపంలో బుధవారం ఉదయం 10.30గంటల నుంచి 12.30 గంటల వరకు సీతారామస్వామివారి పరిణయం జరగనుంది. కల్యాణం నిర్వహించే వేదికను సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తలంబ్రాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. గడిచిన వారం రోజుల నుంచే ఆలయ ప్రాంగణం కల్యాణ శోభను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 25మంది రుత్విక్కులు నిర్విరామంగా పారాయణాలు నిర్వహించారు. లక్ష తులసీదళార్చన, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సీతారాముల కల్యాణం బుధవారం నిర్వహించ నున్నారు. ఉదయం 10 గంటల నుంచి జరగనున్న సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చలువ పందిళ్లతో పాటు దర్శనం కోసం భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు.

ఎండ తీవ్రత దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు

ఎండ తీవ్రత దృష్ట్యా కల్యాణ ప్రాంగణంలో భారీ స్థాయిలో టెంట్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు అందించనున్నారు. సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో వైద్యశిబిరం, భక్తులకు అందించేందుకు తలంబ్రాలను సిద్ధం చేశారు. పెళ్లి వేడుక ముగిసిన వెంటనే తలంబ్రాలను పంపిణీ చేయడానికి ప్రత్యేక కౌంటర్లను కూడా ఏర్పాటు చేశారు.

తిరుపతి నుంచి పట్టువస్త్రాలు

ఏటా జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలకు తిరుపతి నుంచి పట్టు వస్త్రాలు అందించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. తిరుమల దేవస్థానానికి చెందిన వేదపండితులు బుధవారం స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసమూర్తి పట్టువస్త్రాలను సమర్పిస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా గోటి తలంబ్రాల సేవ

శ్రీరామనవమి వేడుకల్లో స్వామివారి కల్యాణానికి గోటి తలంబ్రాలను వినియోగించనున్నారు. గడిచిన మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పలువురు భక్తులు గోటితో వలిచిన కోటి తలంబ్రాలను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. పవిత్ర తలంబ్రాలు రామతీర్థం శ్రీరామస్వామివారి దేవస్థానానికి ఇటీవల చేరుకున్నాయి.

దేవస్థానానికి చేరుకోవడం ఇలా..

విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి 20కిలోమీటర్లు ప్రయాణం చేసి రామతీర్థం చేరుకోవచ్చు. ఆటోల్లో వచ్చే వారు కోట జంక్షన్ నుంచి నెల్లిమర్లలోని రామతీర్థం జంక్షన్‌కు చేరుకుని అక్కడి నుంచి 5కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రణస్థలం నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణం చేసి సతివాడ మీదుగా రామతీర్థానికి చేరుకోవాలి.


స్వామివారి దర్శనం ఇలా..

ఆలయ ఉత్తర రాజగోపురం ద్వారా రూ.50 టికెట్లు తీసుకునే భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఉచిత దర్శన కార్యక్రమాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.


- శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం అధికారులు వివిధ రకాల సదుపాయాలను కల్పించారు.
- పార్కింగ్: ఆలయ ప్రాంగణం వద్ద, కల్యాణ వేదిక ప్రారంభం వద్ద
- తలంబ్రాల కౌంటర్: స్వామివారి కల్యాణ వేదిక వద్ద ఎడమ భాగాన
- ప్రాథమిక చికిత్స కేంద్రం: కల్యాణ వేదిక ప్రాంగణం
- ప్రసాదాల కౌంటర్: తూర్పు రాజగోపురం వద్ద వీటితో పాటు ఎప్పటికప్పుడు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


సీతారాముల కల్యాణ వేదిక


ప్రధాన ఆలయం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు


రామతీర్థం దేవస్థానం

గట్టి బందోబస్తు ఏర్పాటు



శ్రీరామనవమి రోజున రామతీర్థంలో గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. అందరి అధికారుల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. 150మంది పోలీసులతో పాటు ఒక డీఎస్పీ స్థాయి అధికారి, పది మంది ఎస్సైలు, ఐదుగురు సీఐలు విధులు నిర్వహించనున్నారు. సుమారు 15వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. కల్యాణం సజావుగా సాగేందుకు భక్తులు సహకరించాలి.

– రామగణేష్, ఎస్సై, నెల్లిమర్ల


సిద్ధమైన తలంబ్రాల పంపిణీ కేంద్రం

ఏర్పాట్లు పూర్తి చేశాం



ప్రభుత్వ లాంఛనాలతో స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కల్యాణ వేదిక వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాం. భక్తుల కోసం 10వేల లీటర్ల మజ్జిగను సిద్ధం చేశాం. తలంబ్రాల పంపిణీకి ప్రత్యేక క్యూల ఏర్పాటు, ఉచిత ప్రసాదాల పంపిణీ తదితర సౌకర్యాలను అందిస్తున్నాం.

– వై శ్రీనివాసరావు, ఈఓ, రామదేవస్థానం

అభిజిత్ లగ్నంలో స్వామి కల్యాణం



శ్రీరామనవమి సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. ఉదయం 10 గంటల సమయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకువెళ్తాం. అనంతరం విశేష పూజలు నిర్వహించి సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నంలో జీలకర్ర బెల్లం పెట్టించి స్వామి కల్యాణాన్ని వేడుకగా జరిపిస్తాం.

– సాయి రామాచార్యులు, ప్రధాన అర్చకుడు, రామతీర్థం


సిద్ధమైన కల్యాణ వేదిక ప్రాంగణం

దాసరికి ఉగాది స్వర్ణ నంది పురస్కారం


ఉగాది స్వర్ణ నంది పురస్కారం అందుకుంటున్న సినీనటుడు దాసరి తిరుపతినాయుడు

విజయనగరం టౌన్: ప్రముఖ చలన చిత్ర నటుడు, డ్రామా ఆర్టిస్ట్ దాసరి తిరుపతినాయుడుకు ఉగాది స్వర్ణ నంది పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని ఆదర్శ కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో మూడురోజుల కిందట నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఓఎస్‌డీ డాక్టర్ ఎం.ప్రభాకర్, సినీనటుడు మానిక్, తదితరుల చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఆయనకు స్వగ్రామమైన బాడంగి మండలం గొల్లాది వాసులతో పాటు అభిమానులు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో జనసేన ప్రచారం

- నిబంధనలకు విరుద్ధంగా పాలకొండ అభ్యర్థి జయకృష్ణ


ఆర్‌టీసీ బస్సులో ఎన్నికల ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ

వీరఘట్టం: ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ వాహనాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు. అయితే పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ అసెంబ్లీ జనసేన అభ్యర్థి ఆర్టీసీ బస్సులో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఎన్నికల నిబంధనలను తోసిరాజని తనకు నచ్చినట్లు ప్రచారం చేస్తుండడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన భామిని మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా అటుగా వచ్చిన ఆర్‌టీసీ బస్సులోకి ఎక్కి ప్రచారం చేస్తూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారు. తక్షణమే ఎన్నికల అధికారులు జయకృష్ణ ప్రచారంపై విచారణ చేసి తగుచర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుతున్నారు. ఇదే విషయంపై పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు వద్ద సాక్షి ప్రస్తావించగా జయకృష్ణ ఆర్‌టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న ఫొటో పాలకొండ ప్రెస్‌గ్రూప్‌లో చూశానన్నారు. వాస్తవానికి భామిని మండలంలో పాలకొండ డిపో బస్సులు తిరగడం లేదని, అక్కడ శ్రీకాకుళం డిపో బస్సులు తిరుగుతున్నట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం ఆర్టీసీ బస్సు ఎక్కి ఎన్నికల ప్రచారం చేయకూడదని, ఈ విషయాన్ని శ్రీకాకుళం డిపో మేనేజర్‌కు తెలియజేస్తామన్నారు.

8కేజీల గంజాయితో ముగ్గురి అరెస్టు

పార్వతీపురంటౌన్: 8 కేజీల గంజాయితో పట్టుబడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలోని చినమాదిగ వీధి ప్రాంతంలో నివాసం ఉంటున్న నిడగంటి జ్యోతి గంజాయి విక్రయాలు జరుపుతోందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఆమె నివాసం వద్ద ఈ సందర్భంగా 8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న నక్కా వెంకటేష్, ఆమె వద్ద ఉంటున్న సహాయకుడు రోహిత్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై సంతోషి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరంలో మరో ఎనిమిది కిలోలు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తి దగ్గర ఎనిమిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపారు. రైల్వేస్టేషన్ ఆవరణలో తనిఖీలు చేపడుతున్న ఎస్సై హరిబాబునాయుడు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వారి దగ్గర గంజాయి స్వాధీనం చేసుకుని డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో సీజ్ చేశారు. గంజాయి రవాణా చేస్తున్న మహారాష్ట్రకు చెందిన పింటూ అంబుదాస్ పిండేను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు జువైనల్ అని సీఐ చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో 33 కిలోల గంజాయి

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్‌లో రైళ్ల తనిఖీలు ముమ్మరంగా చేస్తున్న జీఆర్‌పీ పోలీసులు మంగళవారం రూ.లక్షా 65వేల విలువైన 33 కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ నంబర్-1లో మహారాష్ట్రకు చెందిన శశికాంత్ చంద్రకాంత్ థోరట్, ఒడిశాకు చెందిన పాదలమ్‌ఖారాలు జైపూర్ నుంచి విజయనగరం బస్‌లో చేరుకుని విజయనగరం నుంచి విశాఖ, అక్కడ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని రవాణాచేయడానికి సిద్ధమయ్యారు. జీఆర్‌పీ సిబ్బంది తనిఖీల్లో భాగంగా రైల్వేస్టేషన్‌లో వారి దగ్గర గంజాయి ఉన్నట్లు గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వేస్టేషన్ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు లైన్స్ సీఐ వెంకటరావు తెలిపారు. ఎస్సై రవివర్మ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్ మరి తొక్కలేం బాబూ..!

- వైఎస్సార్‌సీపీలో జోరుగా టీడీపీ కుటుంబాల చేరిక

కొత్తవలస: సార్వత్రిక ఎన్నికలు ఎన్నికలు సమీపించడంతో వైఎస్సార్ సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. పార్టీలోకి చేరుతున్న వారికి ఆయా నియోజక వర్గాలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో కత్తవలస పట్టణంలోని నాలుగు ఆటోస్టాండ్లకు చెందిన యూనియన్ నాయకుడు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర థియేటర్ యజమాని పాలకుర్తి హరినాథ్‌ల ఆధ్వర్యంలో 45 మంది తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. వారికి కొత్తవలసలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తామని పార్టీలోకి చేరిన వారంతా ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పార్టీ ఎస్.కోట పట్టణ అధ్యక్షుడు రెహమాన్, పార్టీ నాయకులు ఎలమంచిలి అప్పారావు, కోసూరు భారతి తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో 35 కుటుంబాలు..

గజపతినగరం: దత్తిరాజేరు మండలంలోని ఎస్.బూర్జివలస గ్రామానికి చెందిన 35కుటుంబాల వారు (ఎస్సీ, యాత) గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కంది తిరుపతి నాయుడు సహాయంతో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకుని పార్టీలో మంగళవారం చేరారు. వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుల్లో బూర్జివలస గ్రామానికి చెందిన కిక్కుర భాస్కరరావు, గొబ్బి సత్యం, గొబ్బి తాత, గొబ్బి అప్పన్న, గొబ్బి రామకృష్ణ, మొల్లి నూకరాజు, బోనితిరుపతి రావు, బొబ్బిలి రామకృష్ణ, కొయ్యాన అప్పలస్వామి తదితర 35కుటుంబాల వారున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, పురిటిపెంట వైస్ సర్పంచ్ మండల సురేష్, కె.రామునాయుడు, లింగాలవలస అప్పలనాయుడు, రేగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో 25 కుటుంబాలు..

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని డోకిశీల పంచాయతీ చెలంవలస గ్రామానికి చెందిన 25 కుటుంబాల వారు టీడీపీని వీడి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. పార్టీలో చేరిన వారిలో బురిడి నాగేశ్వరరావు, వెంపటాపు రామారావు, శంభాన శ్రీనివాసరావు, రెడ్డి సంతోష్, పెద్దింటి తమ్మినాయుడు, మంగళ అప్పన్న, బెవర అప్పారావుల తో పాటు వారి కుటుంబాల వారున్నారు. వారందరికీ ఎమ్మెల్యే జోగారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, సర్పంచ్ శంపంగి జగదీష్, మంత్రాపు వాసుదేవ రావు, మడక విశ్వనాథం, సచివాలయం కన్వీనర్లు బొమ్మి కోటినాయుడు, నీలాపు గోపాల్, మహాపాత్రో గణేష్, నీలపు బలరాం పాల్గొన్నారు.

గుర్లలో ఐదు కుటుంబాలు..

గుర్ల: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన ఐదు కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు ఆహ్వానించారు.

శృంగవరపు కోటలో 35 మంది

శృంగవరపుకోట: మండల పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ స్వామి నేతృత్వంలో 35మంది పెయింటర్స్ కుటుంబాలు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. అలాగే స్థానిక పందిరప్పన్న జంక్షన్‌కు చెందిన 25మంది యువకులు పంచాయతీ 7వ వార్డు సభ్యుడు గనివాడ శ్రీను నేతృత్వంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే హైమావతి, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, షేక్ రహ్మాన్, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు పాల్గొన్నారు.


కొత్తవలస: పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


గజపతినగరం: ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో పార్టీ కండువాలు వేసుకున్న బూర్జివలస వాసులు


పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు


గుర్ల: పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేస్తున్న పొట్నూరు సన్యాసినాయుడు



శృంగవరపు కోట: ఎమ్మెల్యే శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పందిరప్పన్న జంక్షన్ యువత, పెయింటర్స్